# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 286 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం12 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## మెట్రో ఫేజ్-2 విస్తరణకు
# ఆమోదం తెలపండి

## నిధులు ఇచ్చి తెలంగాణ అభివృద్ధికి సహకరించండి: ప్రధానిని కోరిన సీఎం రేవంత్

**న్యూఢిల్లీ, జూన్ 11 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్-2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు 38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్‌ఏఐకి 626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్



చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ అమరావతి బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగ పడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న ..మిగతా 2లో



## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు
# శాశ్వత భవనాలు

**ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**హైదరాబాద్ జూన్ 11 (నమస్తే ఉదయం)**

రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు ..మిగతా 2లో

## అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం

**మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు**



2లో..

# ఇక బ్యాంకు రుణాలు కష్టమే..!

**క్రెడిట్ స్కోర్ 730 కంటే ఎక్కువ ఉంటేనే ఛాన్స్**

**రిజర్వు బ్యాంకు కఠిన నిబంధనలే కారణం**

**న్యూఢిల్లీ, జూన్ 11 (నమస్తే ఉదయం)**

మీ క్రెడిట్ స్కోర్ 730 కంటే తక్కువగా ఉందా..? అయితే మీకు లోన్లు రావడం ఇక కష్టం కావొచ్చు. ఈ




మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కఠిన నిబంధనలను అమల్లోకి తీస్నుకురానుంది. ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ పేరుతో కొత్త రూల్స్‌ను ఆర్బీఐ ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచిఈ కొత్త నిబంధనలను అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నియమాలతో 730 కంటే సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న వారికి రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులకు మరింత కఠి నిబంధనలు విధించారు. దీంతో క్రెడిట్ హిస్టరీ సరిగ్గా లేకపోయినా, తక్కువగా ఉన్నా రుణ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం తక్కువగా ఉంటుంది. ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ డైరెక్షన్-2026 ఫ్రేమ్ వర్క్‌ను ఆర్బీఐ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకురానుంది. ఇది బ్యాంకింగ్ రంగంలో ఒక కీలకమైన సంస్కరణగా చెప్పవచ్చు. ఈ ..మిగతా 2లో



# రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం

**టీడీపీ, జనసేన సభ్యుల ఎన్నిక ఖరారు**

**టీడీపీ నుంచి సానా, భాష్యం రామకృష్ణ, విజయ్**

**జనసేన నుంచి లింగమనేని రమేశ్ ఎన్నిక**

**న్యూఢిల్లీ, జూన్ 11 (నమస్తే ఉదయం)**

రాజ్యసభకు టీడీపీ, జనసేన నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు పూర్తి కావడం, నాలుగు స్థానాలకు నలుగురు అభ్యర్థులే పోటీలో నిలవడంతో వారి ఎన్నిక ..మిగతా 2లో



## లిక్కర్ స్కామ్‌లో
# ఈడీ దూకుడు

**10 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు**

**రాజ్ కేశిరెడ్డిని అరెస్టు చేసిన ఈడీ**

**మనీ లాండరింగ్, హవాలాపై కీలక ఆధారాలు**

**త్వరలోనే మరిన్ని సోదాలు**

**అంతిమ లబ్ధిదారుడు కోసం దర్యాప్తు**

**న్యూఢిల్లీ, జూన్ 11 (నమస్తే ఉదయం)**

బేవరేజెస్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన వేల కోట్ల మద్యం రవాణా, సిండికేట్ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పక్కా ఆధారాలతో రంగంలోకి దిగింది. గతంలో రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్ట్ చేయడంతో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించి ఇటీవలే బెయిల్‌పై వచ్చిన ఈ స్కామ్ సూత్రధారి, వైఎస్సార్‌సీపీ ..మిగతా 2లో

## గృహిణి సేవలకు
# ఎనలేని విలువ

**మహిళలు దేశాన్ని నిర్మిస్తారు**

**ఏ పరిస్థితుల్లోనైనా రూ. 30 వేల ఆదాయం**

**పంజాబ్ కేసులో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, జూన్ 11 (నమస్తే ఉదయం)**

ఇంట్లో గృహిణి (హోమ్‌మేకర్) రోజంతా చేసే పనులకు ఎనలేని విలువ ఉందని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గృహిణులు కేవలం కుటుంబాలనే కాదు, దేశాన్ని నిర్మిస్తారని కొనియాడింది. రోడ్డు ప్రమాదంలో మరణించిన ఒక మహిళకు సంబంధించిన పరిహారం కేసును విచారిస్తూ, గృహిణి అందించే గృహ సంరక్షణ సేవలను నెలకు కనీసం రూ. 30,000 ఆదాయంగా లెక్కించాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది.

**అసలు కేసు ఇదీ...**

ఈ వివాదానికి సంబంధించిన నేపథ్యం పంజాబ్ రాష్ట్రంలో జరిగింది. 2001 నవంబర్ 25న జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక



మహిళ ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆమె భర్త, ముగ్గురు పిల్లలు పరిహారం కోసం 'మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ..మిగతా 2లో

# 'టీఆర్ఎస్'పై ముప్పేట దాడి

## కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు

**కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు పేరు చిక్కులు**

**'టీఆర్ఎస్' పేరు తమదేనంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్**

**మహారాష్ట్రకు చెందిన ఓ పార్టీ కూడా అదే పేరు కోసం దరఖాస్తు**

**కవిత పార్టీ పేరుపై ఈసీకి వందలాది ప్రజా అభ్యంతరాలు**



2లో..

# అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం

**హైదరాబాద్, జూన్ 11 (నమస్తే ఉదయం)**

'ఫార్మాసిటీ కోసం నా సొంత భూమి 17 ఎకరాలు ఇచ్చాను. ఆ ప్రాజెక్టు కోసం భూమి ఇచ్చిన మొదటి వ్యక్తిని నేనే. ఇక్కడ పెట్టుబడులు పెట్టాల్సిన ఫార్మా కంపెనీలన్నీ ఏపీకి వెళ్లిపోయాయి. ఫార్మాసిటీ వస్తే రాష్ట్రానికి భారీగా ఆదాయం వచ్చేది. కానీ, రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల ఇవాళ రాష్ట్రం ఆదాయం కోల్పోవడంతోపాటు ఇక్కడి పిల్లలకు రావాల్సిన ఉద్యోగాలు కూడా పోయాయి' అని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. జర్నలిస్టులకు ఎలాంటి న్యాయపరమైన వివాదాలు లేని భూములు ఎన్నో ఉన్నాయని.. వాటిని ఇవ్వాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో స్థలాలు ఇస్తామంటే తామేమీ వ్యతిరేకించడం లేదని.. కానీ అక్కడ ఇప్పటికే కొందరు రైతులు కేసులు వేశారని.. అందుకే ఎలాంటి ఇబ్బందులు లేని భూములు జర్నలిస్టులకు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు కేసు కొట్టివేసిందని చెబుతున్నప్పుడు, జర్నలిస్టులకు ఆ పాత భూములే ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇక్కడ ఇవ్వడానికి సుప్రీంకోర్టు తీర్పు అడ్డువచ్చినప్పుడు.. ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి ఆ తీర్పు అడ్డురాదా అని నిలదీశారు. తాను మళ్లీ మళ్లీ స్పష్టంగా చెబుతున్నానని.. తాము అధికారంలోకి రాగానే ఈ ఫ్యూచర్ సిటీని కచ్చితంగా రద్దు చేస్తామని స్పష్టం చేశారు.కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే బడుల ప్రారంభం వాయిదా వేశారని.. విద్యాశాఖలో గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో రూ.2 వేల కోట్ల భారీ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గురుకులాలు, ప్రభుత్వ బడుల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు.. షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్ క్యాప్‌నకు ఇచ్చామని.. రేవంత్‌రెడ్డి వాటిని సెంట్రలైజ్ చేసి, మన వాళ్ల పొట్టగొట్టి గుజరాత్ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారని ఆరోపించారు. ఆ గుజరాత్ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని.. 7 లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, నోట్ బుక్స్ ఏవీ ఇంకా



అందలేదని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా, ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి మించి వేల కోట్ల అప్పులు తేవడానికి ఈ ప్రభుత్వం ఏకంగా దళారులను పెట్టుకున్నదని.. రాష్ట్రం ఇచ్చిన వందల కోట్ల కమీషన్లతో ముంబై బ్రోకర్ విమానం కొనుగోలు చేశారని పేర్కొన్నారు. రైతులకు, విద్యార్థులకు నిధులు లేవంటున్న ప్రభుత్వానికి.. సీఎం వంద కోట్ల గెస్ట్‌హౌస్‌కు, నెలకు 5 కోట్ల హెలికాప్టర్ షికార్లకు డబ్బులెక్కడివని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత సన్నిహితుడి వెన్నుపోటు కుట్ర ఉన్నదని హరీశ్‌రావు అన్నారు. నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక సొంత పార్టీ నేతల కుట్రే దాగి ఉన్నదని.. ఈ నామినేషన్ తప్పుల గురించి లీకులు ఇచ్చింది ఎవరో రేవంత్‌రెడ్డి వెంటనే తేల్చాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆశించిన రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వ్యక్తే ఈ వెన్నుపోటుకు పాల్పడినట్లు తమకు పక్కా సమాచారం ఉన్నదని ఆరోపించారు. కేసీఆర్ అత్యద్భుతమైన సెక్రటేరియట్ నిర్మిస్తే, అక్కడికి వెళ్లని రేవంత్‌రెడ్డి.. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తన క్యాంపు కార్యాలయంగా మార్చుకున్నారని అన్నారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీలో మరో క్యాంపు కార్యాలయం కట్టుకుంటున్నారని.. జూబ్లీహిల్స్‌లో తన నివాసానికి కొద్ది దూరంలోనే ఏకంగా రూ.100 కోట్లతో బోధి పెవిలియన్ పేరుతో విలాసవంతమైన గెస్ట్ హౌస్ కట్టుకుంటున్నారని ఆరోపించారు. అర్ధరాత్రి పూట సతీసమేతంగా వెళ్లి అక్కడి పనులను, కుటుంబ సభ్యులతో సోఫాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ గెస్ట్ హౌస్ కోసం మొదట వీవీఐపీ గెస్ట్ హౌస్ పేరుతో కేవలం రూ.7 కోట్లతో జీవో ఇచ్చి, ఇప్పుడు దాన్ని రూ.100 కోట్లకు పెంచారన్నారు. ఆ గెస్ట్ హౌస్ చుట్టూ రూ.17 కోట్లతో ఇనుప కంచెలు, ఫుట్‌బాల్ ఆడుకోవడానికి రూ.10 కోట్లతో స్టేడియం నిర్మిస్తూ ముఖ్యమంత్రి సోకులు పడుతున్నారని అన్నారు. సీఎం తన విలాసాలకు క్యాంపు కార్యాలయాలు కడుతుంటే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో తన సొంతానికి మూడో క్యాంపు కార్యాలయం నిర్మిస్తున్నారని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి, రైతులకు సాయం చేయడానికి ఖజానాలో డబ్బులు లేవంటున్న ప్రభుత్వానికి.. వందల కోట్లతో గెస్ట్ హౌస్‌లు కట్టుకోవడానికి మాత్రం నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని నిలదీశారు. రాష్ట్రంలో డబ్బులు లేవనడం పచ్చి అబద్ధమన్నారు. మొన్నటివరకు నెలకు రూ.2 కోట్ల అద్దెతో తిరిగిన హెలికాప్టర్ స్థానంలో, ఇప్పుడు నెలకు ఏకంగా రూ.5 కోట్లు వెచ్చించి మరీ కొత్త హెలికాప్టర్‌లో సీఎం షికార్లు చేస్తున్నారని అన్నారు.

ఔటర్ లోపల ఉన్న 111 జీవోను ఎత్తివేసేలా సెక్రటేరియట్‌లో పెద్ద ఎత్తున ఫైళ్లు నడుపుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఉండటం వల్లే విద్యావ్యవస్థ ఇంత అస్తవ్యస్తంగా మారిందన్నారు. చివరకు విద్యార్థులు తినే కోడిగుడ్డులో కూడా అవినీతి చేయడం దారుణమని.. పేద పిల్లలు చదివే గురుకులాల్లో ఇలా కమీషన్లు కొడితే దేవుడు కూడా క్షమించడని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల సంఖ్య దారుణంగా తగ్గిపోయిందని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే రిపోర్ట్ ఇస్తే.. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి యూకేజీ అని రకరకాల కట్టుకథలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ విధానాలతో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైందన్నారు. తాము నిజంగానే చెల్లని నోటు అయితే, తమ గురించి నిద్రలో కూడా ఎందుకు కలవరిస్తున్నారని ప్రశ్నించారు. సీపీఐ గురించి ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు.



# గృహిణి సేవలకు ఎనలేని విలువ

**మొదటి పేజీ తరువాయి...**

ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అప్పట్లో ఆ ట్రిబ్యునల్ వారికి రూ. 2.42 లక్షల పరిహారాన్ని మంజూరు చేసింది. అయితే ఈ పరిహారంతో సంతృప్తి చెందని బాధితులు హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఆ మొత్తాన్ని 7.5 శాతం వడ్డీతో కలిపి రూ. 8.43 లక్షలకు పెంచింది. అయినప్పటికీ తగిన న్యాయం జరగలేదని భావించిన కుటుంబ సభ్యులు చివరకు సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఈ అప్పీలును విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, బాధితులకు అదనపు పరిహారం మంజూరు చేస్తూ గృహిణుల ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. మోటారు వాహనాల ప్రమాద కేసుల్లో గృహిణిని కోల్పోవడాన్ని ఒక ప్రత్యేకమైన, పరిహారం చెల్లించదగిన నష్టంగా పరిగణించాలని కోర్టు స్పష్టం చేసింది. కుటుంబ పోషణ కోసం ప్రత్యక్షంగా సంపాదించే వ్యక్తి ఎంత ముఖ్యమో, ఇంట్లో ఉంటూ సేవలు అందించే గృహిణి పాత్ర కూడా అంతే ముఖ్యం" అని బార్ అండ్ బెంచ్ నివేదిక ప్రకారం కోర్టు వ్యాఖ్యానించింది. "గృహిణి ఒక మనిషి ఎదుగుదలకు, తద్వారా దేశ పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. గృహిణులే నిజమైన దేశ నిర్మాతలు" అని సుప్రీంకోర్టు కొనియాడింది. "మేం కొన్ని ప్రాథమిక సూత్రాలను రూపొందించాం. గృహిణి అందించే గృహ సంరక్షణ నష్టాన్ని ఏ పరిస్థితిలోనైనా నెలకు కనీసం రూ. 30,000 ఆదాయంగా నిర్ధారించాం" అని ధర్మాసనం పేర్కొంది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన 'ప్రణయ్ సేథి' తీర్పులో పేర్కొన్న నష్టపరిహార నిబంధనలకు అదనంగా, ఈ 'గృహ సంరక్షణ నష్టం' అనే అంశాన్ని కూడా చేర్చాలని జస్టిస్ కరోల్ స్పష్టం చేశారు. గృహిణుల శ్రమను సమాజం తక్కువగా అంచనా వేయడంపై న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. సంపాదించే కుటుంబ సభ్యులపై గృహిణులు ఆధారపడతారని అనడం నిజానికి ఒక విచిత్రమైన వాదన అని, వాస్తవానికి గృహిణిపైనే ఇల్లు గడుస్తుందని కోర్టు అభిప్రాయపడింది. "ఆర్థికంగా సంపాదించే వారే నిజానికి గృహిణిపై పూర్తిగా ఆధారపడతారు, కానీ దురదృష్టవశాత్తు ఈ వాస్తవానికి దక్కాల్సిన గుర్తింపు లభించడం లేదు. వివిధ రంగాల్లో ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ఇంకా ప్రయాణించాల్సిన దూరం ఎంతో ఉంది" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది.

# రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం

**మొదటి పేజీ తరువాయి...**

ఏకగ్రీవమైంది. టీటీపీ నుంచి సానా సతీశ్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ పోటీలో నిలవగా.. జనసేన నుంచి లింగమనేని రమేశ్ నామినేషన్ వేశారు. అయితే, పోటీలో నలుగురు అభ్యర్థులే ఉండడంతో వారి ఎన్నిక ఖరారైంది. ఆంధ్రప్రదేశ్ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు జూన్ 1న భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం జూన్ 18న మట్టుత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ తెలిపింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. అలాగే పదవీకాలం ముగియకుండానే ఖాళీ అయిన మరో మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఈసీ తెలిపింది. ఈనెల 9న నామినేషన్ల పరిశీలన.. 11వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చింది. జూన్ 20 నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది

## లిక్కర్ స్కామ్‌లో
# ఈడీ దూకుడు

**మొదటి పేజీ తరువాయి...**

హయాం నాటి మాజీ ఐటీ సలహాదారు రాజ్ కేసిరెడ్డిని ఇప్పుడు ఈడీ మనీలాండరింగ్ ఆరోపణలపై అదుపులోకి తీసుకుంది. ఈ అరెస్టుతో పాటు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 10 ప్రాంతాల్లో ఈడీ ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహిస్తుండటం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. నానక్‌రామ్‌గూడలోని రాజ్ కేసిరెడ్డి నివాసంతో పాటు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్, మాజీ ఎండీ వాసుదేవరెడ్డి ఇళ్లపై కూడా దాడులు జరుగుతున్నాయి. ఈడీ దర్యాప్తు చేస్తున్న ఈ మనీలాండరింగ్ కేసు అత్యంత కీలకమైనదిగా మారుతోంది. కేవలం మద్యం పాలసీలోనే కాకుండా, లిక్కర్ సెంట్రలైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ టెండర్ల ద్వారా సుమారు రూ. 349 కోట్ల మేర అక్రమాలకు పాల్పడి, ఆ నిధులను షెల్ కంపెనీల ద్వారా రియల్ ఎస్టేట్ రంగానికి మళ్లించారనేది ఈడీ ప్రధాన ఆరోపణ. ఢిల్లీకి చెందిన సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ వంటి సంస్థలను ఫ్రంట్‌గా వాడుకుని, తెరవెనుక రాజ్ కేసిరెడ్డి సిండికేట్ 95 శాతం పైగా లాభాలను హవాలా, మనీలాండరింగ్ మార్గాల ద్వారా ల్యాండ్‌మార్క్ ప్రాజెక్టులలోకి పెట్టుబడిగా మార్చినట్లు ఈడీ ఇప్పటికే ప్రాథమిక ఆధారాలు సేకరించింది. ఓల్విక్, అరోయో, ఈజీలోడ్ వంటి డమ్మీ కంపెనీల గుట్టును అధికారులు రట్టు చేసినట్లుగా తెలుస్తుంది. ఈ కేసులో గతంలో ఈడీ జరిపిన ఏడు గంటల సుదీర్ఘ విచారణ అనంతరం వైఎస్సార్‌సీపీ మాజీ కీలక నేత, ఎంపీ విజయసాయిరెడ్డి మీడియా సాక్షిగా చేసిన వ్యాఖ్యలు ఈ కుంభకోణంలో తాడేపల్లి ప్యాలెస్ పాత్రను నేరుగా వేలెత్తి చూపిస్తున్నాయి. ఈ లిక్కర్ స్కామ్‌లో రాజ్ కేసిరెడ్డే 'అన్నీ తానై నడిపిన అసలు పాత్రధారి' అని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచనల మేరకే తాను సజ్జల శ్రీధర్ రెడ్డికి రూ. 100 కోట్లు సర్దాల్సి వచ్చిందని, విజయసాయిరెడ్డి ఈడీకి వాంగ్మూలం ఇవ్వడం వైసీపీకి కోలుకోలేని దెబ్బగా మారింది.

### త్వరలో జగన్‌కు నోటీసులు?

ఈడీ తాజాగా అటాచ్ చేసిన దాదాపు రూ. 441 కోట్ల విలువైన ఆస్తుల లంకెలు, నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డిజిటల్ డేటా ఆధారంగా ఈ కుంభకోణంలోని అన్ని వేళ్లు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నివాసం వైపే చూపుతున్నాయని భావిస్తున్నారు. ప్రభుత్వ అధికార దుర్వినియోగం ద్వారా డిస్టిలరీల నుంచి రూ. 3,500 కోట్ల మేర ముడుపులు వసూలు చేశారనే ఆరోపణలు, హవాలా లావాదేవీల లూప్‌ను ఈడీ బ్రేక్ చేయడంతో.. స్కామ్ వెనుక ఉన్న అసలు 'పెద్దల' చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లుగా తెలుస్తోంది. రాజ్ కేసిరెడ్డి కస్టడీ విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి రానున్నాయి. మద్యం వ్యాపారంలో జే-బ్రాండ్స్ పేరిట నాసిరకం లిక్కర్ అమ్మి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటూ సంపాదించిన ఈ వేల కోట్ల రూపాయల అవినీతి సొమ్ము చివరకు ఏ ఏ ఖాతాల్లోకి వెళ్ళిందనే పూర్తి రూట్ మ్యాప్‌ను ఈడీ బహిర్గతం చేయనుంది. త్వరలోనే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కూడా ఈడీ విచారణ నోటీసులు జారీ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఇక బ్యాంకు రుణాలు కష్టమే..!

**మొదటి పేజీ తరువాయి...**

సంస్కరణల ప్రకారం 730 కంటే తక్కువ సిబిల్ స్కోర్ ఉన్నవారు రుణాలు పొందే విషయంలో కఠినమైన పరిశీలనను ఎదుర్కొంటారు. అధిక వడ్డీ రేట్లు, అదనపు పూచీకత్తు సమర్పించడం వంటి సమస్యలు రావొచ్చు. దేశంలోని రుణ దరఖాస్తుదారులలో 62 శాతం మంది ఈ వర్గంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత వ్యవస్థ ప్రకారం బ్యాంకులు రుణ డిఫాల్ట్‌లు జరిగిన తర్వాతే స్పందిస్తున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం బ్యాంకులు భవిష్యత్ డేటాను ఉపయోగించి రుణగ్రహీత రిస్క్‌ను నిరంతరం అంచనా వేస్తాయి. ఈఎంఐ ఆలస్యంగా చేయడం, అస్థిరమైన ఆదాయ సరళి, క్రెడిట్ వినియోగంలో ఆకస్మిక పెరుగుదల వంటి వాటిని పరిగణలోకి తీసుకుని పూర్తిగా రుణ దరఖాస్తులు తిరస్కరించవచ్చు.

### రానున్న రోజుల్లో కష్టమే

కొత్త రూల్స్ వల్ల 730 కంటే ఎక్కువ సిబిల్ స్కోర్ ఉన్న సుమారు 7 కోట్ల ప్రీమియం కస్టమర్లకు బ్యాంకులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి. వీరికి బహుమతులు అందించడంతో పాటు పోటీతత్వంతో కూడిన ఆర్థిక ఉత్పత్తుల పూర్తి శ్రేణితో సేవలు అందిస్తారు. మిగతా అందరికీ రుణం అందటం కష్టంగా మారవచ్చు. అయితే సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు, స్టెప్-అప్ లోన్ ఉత్పత్తులు, సూక్ష్మ రుణ మార్గాలు వంటి వాటిని తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్నవారి కోసం అందుబాటులో ఉంచనున్నారు. ప్రస్తుతం బ్యాంకులు సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నా తమకు నమ్మకమైన కస్టమర్‌గా ఎక్కువకాలం పాటు కొనసాగుతుంటే రుణాలు మంజూరు చేస్తున్నాయి. కానీ రానున్న రోజుల్లో ఈ విధానంలో రుణాలు పొందటం కష్టం కావొచ్చు. ఆర్బీఐ నియమాలు అందుకు అనుమతించవు.



# మెట్రో ఫేజ్-2 విస్తరణకు ఆమోదం తెలపండి

**మొదటి పేజీ తరువాయి...**

అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ధి చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం- 2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

**మొదటి పేజీ తరువాయి...**

తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతా ధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ ఊ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిధిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి దశలో అద్దె భావనాలల్లో, శిథిలావస్థాలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. స్టాంప్స్ ఊ రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు.ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువు, కోహెడ లలో భవనాలకు శంకుస్థాపన చేసుకొని పనులు కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు. జిల్లా నియోజక వర్గ కేంద్రాలల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సంఖ్యకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండు డిఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నాలుగు వేల చదరపు అడుగుల నుంచి పది వేల చదరపు అడుగులు ఉండేలా ఒకే నమూనాలో నిర్మించాబోతున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందని త్వరలోనే క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించబోతున్నామని వెల్లడించారు.

# కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు

**న్యూఢిల్లీ, జూన్ 11 (నమస్తే ఉదయం)**

కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. పార్టీ పేరు చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో, ఈ అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'టీఆర్ఎస్' అనే పేరును ఇతరులకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీఆర్ఎస్' అనే పేరు 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తమ పార్టీని ప్రజలు 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించవద్దని కోరుతూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది. మరోవైపు, కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే సంస్థ కూడా 'టీఆర్ఎస్' అనే పేరు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు తెలియవచ్చింది. ఇవి మాత్రమే కాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటన ఆధారంగా సుమారు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఈసీకి అందినట్లు సమాచారం. అదే సమయంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో పార్టీ కూడా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని వాడటంపై అభ్యంతరం తెలుపుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, తమ వాదనలు వినిపించేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతోంది. ఒకే పేరుపై ఇన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో కవిత తన కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరును దక్కించుకుంటారా లేదా అన్నది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

# మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో దొంగతనం, మోసానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

## రూ. 70,000 నగదు, బంగారు పుస్తెలు, కారు స్వాధీనం






వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

**బుద్వేల్, జూన్ 11 (నమస్తే ఉదయం) :**

ఇన్‌స్టాగ్రామ్, డేటింగ్ యాప్ ద్వారా మహిళలకు ఎర వేసి, ఉద్యోగాల ఆశ చూపి మోసాలకు, దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర కేటుగాళ్లను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుండి దొంగిలించబడిన బంగారు మంగళసూత్రం (పుస్తెలు, గుండ్లు), నగదు, నేరానికి ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుల వివరాలు :**

కుడుముల పాండురంగారావు అలియాస్ సన్నీ నాయుడు (32), తండ్రి: శివయ్య, వ్యాపారం, నివాసం: సీతమ్మధార, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ (స్వస్థలం: రాములవారి గుడి వెనుక, అనకాపల్లి).

పెరియన్నన్ అలియాస్ కుమార్ (డ్రైవర్), తండ్రి: విశ్వనాథన్, నివాసం: కృష్ణాపురం, వాణియంబాడి, వేలూరు జిల్లా, తమిళనాడు లు కలసి ఈ నెల 2వ తేదీన మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని కాటేధాన్, పద్మశాలీపురానికి చెందిన జెట్ల శ్రీవాణి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్ / ఈజ్ యాప్ ద్వారా 'పాండురంగారావు' అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. తాను ఒక ప్రముఖ ఫిల్మ్ ప్రొడ్యూసర్ కొడుకునని, ఫైనాన్స్ వ్యాపారాలకు మేనేజింగ్ డైరెక్టర్ అని పరిచయం చేసుకున్న నిందితుడు, ఆమెకు తమ కంపెనీలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు.

ఈ క్రమంలో జూన్ 1న తనకు అత్యవసరంగా డబ్బు కావాలని అడగడంతో బాధితురాలు రూ. 7,500/- పంపింది. మరుసటి రోజు జూన్ 2 న నిందితుడు ఆమెను కలవడానికి కాటెదాన్ లోని ఆమె ఇంటికి వచ్చాడు. ఇంట్లో కూర్చుని ఉద్యోగ విషయాల గురించి కాసేపు మాట్లాడిన అనంతరం, బాధితురాలు అతనికి తాగడానికి నీళ్లు ఇచ్చింది. ఆమె నీళ్లు తేవడానికి వెళ్లిన సమయంలో.. అద్దం ముందు ఉంచిన బాధితురాలి బంగారు మంగళసూత్రాన్ని నిందితుడు గుట్టుచప్పుడు కాకుండా దొంగిలించి, అక్కడి నుండి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నంబర్: క్రైమ్ నం. 318(4), 303(2) దీఛీ బిఎన్ఎస్ సెక్షన్లు 318(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం అందిన నమ్మకమైన సమాచారం మరియు లభించిన సాంకేతిక ఆధారాల సహాయంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి

బంగారు ఆభరణాలు, బంగారు పుస్తెలు, , బంగారు గుండ్లు (మంగళసూత్రం).

నగదు: రూ. 70,000/-

కారు: టయోటా ఎటియోస్ కారు (రిజిస్ట్రేషన్ నం: కె ఎ 52 బి 9241).

ఇతర వస్తువులు: మణప్పురం ఫైనాన్స్ప్రకటించడం లిమిటెడ్ గోల్డ్ లోన్ రశీదు, వివో మొబైల్ ఫోన్లు, వన్‌ప్లస్ మొబైల్ ఫోన్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఏటీఎం కార్డ్, ఇండియన్ బ్యాంక్ రూపే డెబిట్ కార్డ్.

పౌరులకు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ సూచనలు చేశారు . సోషల్ మీడియాలో పరిచయమయ్యే అపరిచిత వ్యక్తులు మరియు థర్డ్ పార్టీ యాప్స్ (డేటింగ్ యాప్స్) ద్వారా పరిచయమయ్యే వారిని గ్రూపులలో స్నేహితులుగా భావించి నమ్మవద్దు. ఆన్‌లైన్‌లో పరిచయమైన అపరిచితులతో మీ వ్యక్తిగత వివరాలు, ప్రొఫైల్ ఫోటోలు, ఆధార్/ఐడీ ప్రూఫ్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ షేర్ చేయవద్దు. ఆన్‌లైన్ పరిచయాలను నమ్మి ఎలాంటి ఆర్థిక లావాదేవీలు (డబ్బులు పంపడం) చేయవద్దు. ఉద్యోగాల కోసం ప్రయత్నించేటప్పుడు వ్యక్తిగత మెసేజింగ్ యాప్స్ ద్వారా కాకుండా, సదరు కంపెనీల అధికారిక ఈమెయిల్స్ మరియు వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే సంప్రదించండి. ఆన్‌లైన్ అపరిచితులకు మీ నివాస వివరాలు, ఇళ్ల అడ్రస్‌లను చెప్పవద్దు మరియు వారిని ఇంటికి రానివ్వద్దు. ఆన్‌లైన్ లో వచ్చే నకిలీ ఉద్యోగ ఆఫర్లు, ఆశచూపే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు.

# శరవేగంగా కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

## స్థానిక ప్రజల చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం.

**రాజేంద్రనగర్,జూన్11(నమస్తే ఉదయం)**





మూసి ప్రాంతం నుండి వైష్ణవి ఓవైసిస్,క్రేయాన్స్ హాస్పిటల్ మెయిన్ రోడ్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు యుద్ధ ప్రాతిపదికన శరవేగంగా కొనసాగుతున్నాయి.ఈ ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా పరిశీలించి,ప్రజల సమస్యను తీర్చటంలో ముందు ఉన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక చొరవతో సుమారు రూ.4 కోట్ల నిధులు మంజూరై,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి.ఈ పనులు పూర్తయిన అనంతరం స్థానిక నివాసితులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.అయితే గత రెండేళ్లుగా ఈ ప్రాంత ప్రజల సమస్యలను పట్టించుకోని,ఒక్కసారి కూడా సందర్శించని బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్ రెడ్డి,ప్రస్తుతం సమీపిస్తున్న రాజకీయ ఎన్నికల నేపథ్యంలో ఆకస్మికంగా ప్రాంతాన్ని సందర్శించడం ఆశ్చర్యకరంగా ఉంది.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఇప్పటికే పనులు ప్రారంభించి వేగంగా అమలు చేస్తున్న సమయంలో,పనుల స్థలాన్ని సందర్శించి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం సమంజసం కాదు.ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని,సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకత్వాన్ని,ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే రాజకీయ అవకాశవాదాన్ని గుర్తించగలరని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్,జూన్11(నమస్తే ఉదయం)**

మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.డివిజన్ లోని బృందావన్ కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు బస్తీలోని సమస్యలపై ఆయన బస్తీ నాయకులతో కలిసి పర్యటించారు.భూగర్భ,డ్రైనేజీ వ్యవస్థ,పైప్ లైన్లు,నూతన సిసి రోడ్లు,ప్యాచ్ వర్క్,ఎలక్ట్రిక్ కేబుల్ లైన్ సమస్యలపై బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటూ సుదీర్ఘంగా పర్యటించారు.ఈ మేరకు సంబంధిత అధికారితో మాట్లాడారు.వీలైనంత త్వరగా నూతన సీసీ రోడ్ల పనులు ప్రారంభమవుతావని,అదేవిధంగా మాన్యువల్ కవర్స్ డామేజ్ పైప్ లైన్స్ పనులపై దృష్టి సాధించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా స్థానిక నాయకులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు.డివిజన్ వ్యాప్తంగా మౌలిక వసుతుల కల్పనకు అధిక ప్రాధన్యతనిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్



అధ్యక్షుడు గోద పాండుయాదవ్,సీనియర్ నాయకులు రావుల భాస్కర్,సంతూగౌడ్,కొవ్వాకుల బాబు,కృష్ణ, రవి,శివరాజ్, గోపాల్, గుణవంతరావు,బుగ్గయ్య, గాంధీ, రాజు స్వామి, మల్లికార్జున్,కిరణ్,రమేష్,రమేష్ యాదవ్, మారుతి, నిరంజన్, అర్జున్, లక్ష్మమ్మ,వెంకటమ్మ,స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.

# ఉప్పర్ పల్లి ప్రభుత్వ పాఠశాలకు ప్రహారీగోడను ఏర్పాటు చేయాలి

## రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ డిమాండ్








**రాజేంద్రనగర్,జూన్11(నమస్తే ఉదయం)**

ఉప్పర్ పల్లిలో ప్రభుత్వ పాఠశాల పహారీగోడ లేకపోవడంతో విద్యార్థులు రోడ్డు ప్రమాదాల భారీన పడుతున్నారని,తక్షణమే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రహారీగోడను ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ అన్నారు.విద్యార్థులు రోడ్డు ప్రమాదాల భారీన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే,మాజీ కార్పొరేటర్ ఎన్నోసార్లు వచ్చి పరిశీలించి వెళ్లారు కానీ ప్రభుత్వ పాఠశాల మాత్రం ఎలాంటి అభివృద్ధి కాలేదని అన్నారు.పాఠశాలలో మంచినీటి సమస్య క్లాస్ రూమ్ లు సరైన విధంగా లేవన్నారు.బాత్ రూంల సదుపాయాలు సరిగా లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకుడు విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

# కారు చక్రాల కింద పడి బాలుడు మృతి

**బుద్వేల్, జూన్ 11 (నమస్తే ఉదయం) :**



షియం కుమార్

మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కారు చక్రాల కింద మూడేళ్ల బాలుడు పడడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మైలార్ దేవ్ పల్లి ఎస్సై విశ్వనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పల్లెచెరువు ప్రాంతంలో గోబింద్ రామ్ సోమరి దేవిలు తమ కుమారుడు షియం కుమార్(3)తో కలిసి నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటుండగా అదే సమయంలో విజయ్ నేహా పాలిమర్స్ కంపెనీకి చెందిన కారు టిజి07ఏకే 3600ను డ్రైవర్ అరవింద్ (30) వేగంగా తీసుకువచ్చాడు. ఆడుకుంటున్న బాలుడిపైకి ఎక్కించడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు బాలుడిని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు గురువారం ఉదయం మృతి చెందాడు. బాలుడి మృతికి కంపెనీ యాజమాన్యం కారణమని గురువారం కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు పెద్ద ఎత్తున చేరుకొని విజయ్ నేహా పాలిమర్స్ కంపెనీ ముందు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రక్తతకు దారి తీయడంతో పోలీసులు చేరుకోని ఆందోళన కారులతో మాట్లాడి సర్దిచెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




నేపాలి గ్యాంగ్ వివరాలను వెల్లడిస్తున్న సిపి తో పాటు ఇతర అధికారులు.. స్వాధీనం చేసుకున్న బంగారం నిందితుల ఫోటోలు.

# మైలార్ దేవ్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన

## జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణకుమారి

**రాజేంద్రనగర్,జూన్11(సూర్యరేఖ)**

మైలార్ దేవ్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి సందర్శించారు.రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణకుమారి మైలార్ దేవ్ పల్లి ప్రాథమికి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి,అక్కడ అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు,ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఓపీ సేవలు,గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవలు,శిశు సంక్షేమ కార్యక్రమాలు,సంపూర్ణ టీకాకరణ,కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు,అంటువ్యాధుల నియంత్రణ చర్యలు,ఎన్సీడీ స్క్రీనింగ్ కార్యక్రమాలు,ఔషధాల నిల్వలు,రికార్డుల నిర్వహణను సమీక్షించారు.ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో,నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ,రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.అలాగే ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.మాతా-శిశు ఆరోగ్య సూచికల మెరుగుదల,వంద శాతం టీకాకరణ, అధిక ప్రమాద గర్భిణీల గుర్తింపు పర్యవేక్షణ,క్షయవ్యాధి నియంత్రణ,రక్తపోటు,మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమాల అమలులో మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు.ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి సూచించారు.




# ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యం..

## అన్ని పార్కులను అభివృద్ధి చేస్తాం..

## రూ.52లక్షలతో ఏర్పాటు చేసిన రెండు పార్కులను ప్రారంభించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,జూన్11(నమస్తే ఉదయం)**

ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం పార్కులను అభివృద్ధి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు . రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల లో ఏర్పాటు చేసిన రెండు పార్కులను గురువారం ఆయన శాసనమండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్,రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి,అర్బన్ బయోడైవర్సిటీ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు,లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించినప్పుడు మానసిక ప్రశాంతత ఉంటుందని గుర్తు చేశారు.ప్రజలకు మెరుగైన జీవన విధానాలను కల్పించడానికి పార్కులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉదయం,సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసుకోవడానికి,కుటుంబంతో కలిసి సేద తీరడానికి, చిన్నపిల్లలు ఆడుకోవడానికి పార్కులు అనుకూలంగా ఉంటాయన్నారు.రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...రాజేంద్రనగర్ సర్కిల్ జనచైతన్య కాలనీలో రూ.29.91లక్షలతో ఒక పార్కు ,అత్తాపూర్ సర్కిల్ హైదర్ గూడ సిరిమల్లెనగర్ కాలనీలో రూ. 22.34 లక్షలతో ఒక పార్కును అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.ఇలాంటి పార్కులు స్థానిక ప్రజలకు, కాలనీవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ పరిధిలో ఉన్న పార్కులన్నింటినీ అందంగా తీర్చిదిద్దడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు సురేందర్ రెడ్డి,మల్లారెడ్డి,లతో పాటు వివిధ విభాగాల అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

# ముచ్చోనిపల్లి రిజర్వాయర్ వద్ద
# యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు
## అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తేఉదయం)**

గట్టు మండలం పరిధిలోని ముచ్చోనిపల్లి రిజర్వాయర్, 109 ప్యాకేజీ అలుగు వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రింబవళ్లు అనధికారికంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ కొందరు వ్యక్తులు యథేచ్ఛగా సాగిస్తున్న ఈ అక్రమ దందాపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**స్పందించని స్థానిక యంత్రాంగం:**

ఈ అక్రమ మట్టి రవాణాపై స్తానిక అధికారులకు స్థానికులు పూర్తి సమాచారాన్ని అందించారు. అక్రమ తవ్వకాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను వాట్సాప్ ద్వారా అధికారులందరికీ పంపినప్పటికీ, వారు చూసిచూడనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు అందినా క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో, ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ అక్రమ మట్టి తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని, నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు జరుపుతున్న వారిపై మరియు వారికి సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముచ్చోనిపల్లి గ్రామస్తులు మరియు పరిసర ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నేపాల్ వ్యక్తులను పనుల్లో నియమించే ముందు తగు జాగ్రత్తలు పాటించాలి

**బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి సూచన**

**పటాన్ చెరు, జూన్ 11 (నమస్తే ఉదయం):**



ఇంటి పనుల కోసం నేపాల్ కు చెందిన వ్యక్తులను నియమించుకొనే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఐడిఎ బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో నేపాల్ కు చెందిన వ్యక్తులు అనేక ఇళ్ళలో దొంగతనాలు చేయడంతో పాటు హత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో నేపాల్ కు చెందిన వ్యక్తులను పనుల్లో నియమించుకునే ముందు వారికి సంబంధించిన పూర్తి వివరాలను తీసుకోవాలని ఆయన సూచించారు. నేపాల్ కు చెందిన వ్యక్తులు ఇంటి పనుల కోసం వచ్చి ఇంటి యజమానులతో ఎంతో నమ్మశక్యంగా ఉంటూ, యజమానుల యొక్క విలువైన వస్తువులు గురించి పూర్తి వివరాలు తెలుసుకుని అదును చూసి అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంగతులు బయటపడుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో నేపాల్ కు చెందిన వ్యక్తుల యొక్క ఆధార్ కార్డులు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, గుర్తింపు కార్డులు, శాశ్వత చిరునామా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇళ్ళు, వాణిజ్య సముదాయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆయా వివరాల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఎలాంటి అనుమానాస్పద విషయాల గురించి తెలిస్తే పోలీసులకు తెలపాలని ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి తెలిపారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం):**

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జూన్ 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ దినోత్సవంకు సంబంధించిన గోడపత్రికలను సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. యాక్సెస్ టు జస్టిస్ మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు చిన్నమ్మ తామస్, డిసిపిఓ నరసింహ, కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎడ్విన్ థామస్, శ్రీలక్ష్మి, సోషల్ మొబిలైజర్స్ ధనలక్ష్మి, విజ్జులత, మద్దిలేటి పాల్గొన్నారు.






## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్11 (నమస్తేఉదయం)**

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు దోహదపడాలని ధరూర్ ఎంఈఓ రవీంద్రబాబు కోరుతున్నారు. గురువారం ధరూర్ మండలం జాంపల్లి ప్రాథమికోన్నయ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు, సౌకర్యాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్, తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి
## నిధులను సద్వినియోగం చేసుకుంటేనే అభివృద్ధి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.






**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం)**

గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకుంటే వివిధ నిధులను సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి గాను 16వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగంకు రూపొందించాల్సిన జిపిడిపి (గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్), బీపీడీపీ (బ్లాక్ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్), డిపిడిపి (డిస్టిక్ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్)పై జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు నిర్వహించిన వర్క్ షాప్ లో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. గ్రామపంచాయతీలకు వివిధ పన్నుల ద్వారా వచ్చే జనరల్ ఫండ్ తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, దాతల విరాళాలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పక్కా ప్రణాళిక రూపొందించుకుంటేనే ఆయా నిధులను సద్వినియోగం చేసుకోవచ్చున్నారు. గ్రామస్థాయిలో పనిచేసే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర జిపిడిపి రూపొందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సబ్ కి యోజన, సబ్కా వికాస్ సైట్ లో జిపిడిపి వివరాలను ఈనెల 30వ తేదీలోగా అప్లోడ్ చేయాల్సి ఉందన్నారు. వివిధ జాతీయ పంచాయతీ అవార్డులను పొందేలా గ్రామపంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేసుకునేందుకు జిపిడిపి దోహదపడుతుందన్నారు. ఇటీవల జిల్లాలోని కొన్ని గ్రామపంచాయతీలు జాతీయ పురస్కారాలు పొందేందుకు నిర్దేశిత సూచీలో 90 మార్కులు సాధించి నామినేట్ కావడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి లైన్ డిపార్ట్మెంట్ అధికారులు జిపిడిపిల రూపకల్పనలో ఎంపీడీవోల సహకారం తీసుకోవాలని, వారి మార్గదర్శకత్వంలో ముందుకెళ్లాలన్నారు. అధికారుల అలసత్వంతో నిధులు వెనక్కి వెళితే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ వర్క్ షాప్ లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ శ్రీకాంత్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733